సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం : 30 : జూన్ : 2025



ట్రా 'ఫికర్'

భువనగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రద్దీ ఉంటుంది. - 9లో



పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్ కోరారు. - 9లో



పాలసంఘాల చైర్మన్ల ఎన్నిక

జిల్లాలోని పలు గ్రామాల్లో పాల సొసైటీలకు ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్లు, డైరెక్టర్లను ఎన్నుకున్నారు. - 9లో

న్యూస్‌రీల్

నిజామాబాద్‌కు బస్సు సౌకర్యం



బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రాజాపేట: యాదగిరిగుట్ట డిపో నుంచి రాజాపేట మండలంలోని రఘునాథపురం మీదుగా నిజామాబాద్‌కు ఆదివారం బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. బస్సుకు గ్రామస్తులు స్వాగతం పలికారు. నిజామాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించినందుకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, గుట్ట డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా రజనీ

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు గవర్నమెంట్ అసిస్టెంట్ ప్లీడర్‌గా సీనియర్ అడ్వకేట్ రజనీని నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం తరపున సివిల్ కేసులను ఆమె వాదించనున్నారు. మూడేళ్ల పాటు అసిస్టెంట్ ప్లీడర్‌గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు ధరల భారం!

పెరిగిన స్టీల్, సిమెంట్, ఇసుక, కంకర ధరలు



ఇంటి నిర్మాణ సామగ్రి రేట్లు (రూ.ల్లో)

మెటీరియల్	గతంలో	ప్రస్తుతం
సిమెంట్ (బస్తా)	280	330 - 360
స్టీల్ (క్వింటా)	5,500	6,000 - 7,800
ఇసుక (ట్రాక్టర్)	1500	3,500 - 4,000
రాయి (ట్రాక్టర్)	3,200	3,000 - 4,000
ఇసుక (ట్రాక్టర్)	1,500	3,500 - 4,000
కూలి (పురుషులు)	800	1,300
మహిళలకు	500	1,000

- అడ్డా కూలీలకు ఫుల్ డిమాండ్
- ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయం రూ.5 లక్షలు
- అదనంగా రూ.4 లక్షల వరకు ఖర్చు
- ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలంటున్న లబ్ధిదారులు

సాక్షి,యాదాద్రి : పెరిగిన సిమెంట్, స్టీల్, ఇసుక ధరలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారులపై భారం పడుతోంది. ఇళ్ల నిర్మాణాలు గాడిన పడుతున్న తరుణంలోనే సామగ్రి రేట్లు అధికం కావడం ప్రతిబంధకంగా మారింది. వీటికి తోడు కంకర, కూలి రేట్లు సైతం పెంచారు. పెరిగిన ధరలను బట్టి ఒక్కో ఇంటిపై రూ.3 నుంచి రూ.4లక్షల వరకు అదనపు భారం పడేలా ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు.

రెండు విడతల్లో మంజూరైన ఇళ్లు..

తొలి విడతలో జిల్లాలోని 17 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద 761 ఇళ్లు మంజూరయ్యాయి. రెండో విడతలో నియోజక వర్గాల వారీగా 8,191 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో మొదటి, రెండో పేజ్ కలిపి సుమారు 4వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వం విడతల వారీగా లబ్ధిదారుకు రూ.5లక్షల సాయం అందజేస్తుంది.

మండుతున్న సిమెంట్..

ఇందిరమ్మ ఇంటికి 500 నుంచి 525 బస్తాల సిమెంట్ కావాలి. నెల రోజుల క్రితం బస్తా ధర రూ.280 ఉండగా ప్రస్తుతం గ్రేడ్‌ను బట్టి ఒక్కో బస్తాపై రూ.50నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. పాత ధర ప్రకారం రూ.1,47,000 సిమెంట్ ఖర్చు వచ్చేది. ప్రస్తుత రేటును బట్టి కట్టకు రూ.50 అదనంగా వేసుకున్నా రూ.1,73,250 అవుతుంది. ఈ లెక్కన ఒక్కో లబ్ధిదారుడిపై సిమెంట్ రూపేణా రూ.26,250 వరకు అదనపు భారం పడుతోంది. కట్టకు రూ.80 అయితే రూ.1,89,000 అవుతుంది.

నేల స్వభావాన్ని బట్టి పెరుగుతున్న ఖర్చు

పెరిగిన సిమెంట్, స్టీల్, ఇసుక, రాయి, కంకర, కూలీల రేట్ల కారణంగా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలకు అదనంగా మరో రూ.4లక్షల వరకు ఖర్చు వస్తుందని లబ్ధిదారులు అంటున్నారు. నేల స్వభావాన్ని బట్టి కూడా నిర్మాణ వ్యయం పెరుగుతుంది. చౌడు నేలలో తప్పనిసరిగా పిల్లర్లు పోయాల్సి వస్తుండటంతో మరింత భారం పడుతుంది.

అదును చూసి కొరత సృష్టించి..

ఇళ్ల నిర్మాణాల నేపథ్యంలో ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా వ్యాపారులు కొరత సృష్టిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. సీనరేజ్ చార్జి లేకుండా ట్రాక్టర్, లేబర్ చార్జీలు లబ్ధిదారులే చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి పది ట్రాక్టర్ల ఇసుక కావాలి. ఇసుక కొరత వల్ల ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతున్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు ఇస్తున్నారు. ముఖ్యంగా భువనగిరి, యాదగిరిగుట్ట, పోచంపల్లి, చౌటుప్పల్ మండలాల పరిధిలోని వాగుల్లో ఇసుక నిల్వలు లేవు. దీన్ని ఆసరాగా చేసుకుని ఆలేరు, బిక్కేరు, చిన్నేరు, మూసీ పరీవాహకంలో ధర పెంచి ఇసుక విక్రయిస్తున్నారు. గోదావరి రీచ్‌ల నుంచి కూడా ఇసుక వస్తున్నప్పటికీ ధర మండిపోతుంది.

ట్రాక్టర్ ఇసుక రూ.3,500కు పైనే..

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా సరఫరా చేయాల్సి ఉంది. కానీ, ట్రాక్టర్ల యజమానులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. ట్రిప్పు ఇసుకకు రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రూ.4వేల వరకు తీసుకుంటున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముందు ట్రాక్టర్ ఇసుక ఏరియాను బట్టి రూ.1,500 నుంచి రూ.రెండు వేల వరకు సరఫరా చేసేవారు.

స్టీల్ ధరలకు రెక్కలు

స్టీల్ ధర కంపెనీని బట్టి గతంలో క్వింటా కనిష్టంగా రూ.5,500 ఉండగా ఇప్పుడు గరిష్టంగా రూ.7,800కు చేరింది. ఇంటి నిర్మాణానికి కనీసం 1.50 టన్నుల స్టీల్ పడుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. రూ.5,500 చొప్పున రూ.82,500 అవుతుండగా.. సగటున క్వింటాకు రూ.7,500 చొప్పున రూ.1,12,500 ఖర్చవుతుంది. ఈ లెక్కన రూ.30,000 వరకు అదనపు భారం పడుతుంది.

అడ్డా కూలీలకూ గిరాకి

గతంలో అడ్డా కూలీకి పురుషులకు రోజుకు రూ.800 ఉండేది. ప్రస్తుతం రూ.1,300 అడుగుతున్నారు. మహిళలకు రూ.500 ఉండగా రూ.1000 డిమాండ్ చేస్తున్నారని, కూలి ఎక్కువ ఇచ్చినా కూలీలు దొరికే పరిస్థితి లేదని హమాలీలు చెబుతున్నారు.

రాయి, దొడ్డు కంకరకు రూ.1,800 పెంపు

బేస్మెంట్ నిర్మాణానికి రాయి తప్పనిసరి. గతంలో ట్రాక్టర్ రాయి, దొడ్డు కంకర రూ.3,200 ఉండగా ప్రస్తుతం రూ.3,500 నుంచి రూ.4,000 వరకు పలుకుతోంది. ఇక స్లాబ్‌లో ప్రత్యేకంగా సన్న కంకర వాడాల్సి ఉంటుంది. దాని ఖర్చు అదనం.

ఇకనుంచి తహసీల్దార్ల పర్యవేక్షణలో ఇసుక సరఫరా

ఇసుక సమస్యను అధిగమించేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది.కొరత ఉన్న ప్రాంతాలకు ఇసుక నిల్వలున్న వాగులు, మూసీ నుంచి అవసరం మేరకు సరఫరా చేయాలని నిర్ణయించారు. తహసీల్దార్ పర్యవేక్షణలో ఇసుక సరఫరా జరుగుతుంది. అలాగే గోదావరి రీచ్‌లనుంచి ఇసుక తీసుకువచ్చి నిల్వ చేయడానికి డిపోలు ఏర్పాటు చేయనున్నారు.

ఇదీ.. ట్రాన్స్‌కో తీరు!



విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనం ఈ చిత్రం. యాదగిరిగుట్ట పట్టణంలోని 6వ వార్డులో ఓ ఇంటి పక్కన డ్రెయినేజీలోనే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి తొలగించి సురక్షితమైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని పలుమార్లు ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. అక్కడ నిత్యం పిల్లలు ఆడుకుంటారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- యాదగిరిగుట్ట

ఆలయం, భక్తుల భద్రతకు ప్రాధాన్యం

- ఆలయ ఈఓ వెంకట్రావ్



ఉన్నతాధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం, భక్తుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని, అందుకోసం పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఆలయ ఈవో వెంకట్రావ్ ఆదేశించారు. ఆలయ భ్రదతపై ఆదివారం యాదగిరికొండపైన ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. భద్రతను కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా ఎస్పీఎఫ్, హోంగార్డులను పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ, సీసీ కెమెరాల పనితీరును మెరుగుపర్చాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సీసీ కెమెరాలను అదనంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జూలైలో దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ పరిధిలోని ఐదు ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. అందుకు అవసరమైన మొక్కలు సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. అంతే కాకుండా వాహన పూజల స్థలాన్ని ఘాట్ రోడ్డు -2 సర్కిల్ పక్కన ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ అధికారులు దయాకర్‌రెడ్డి, నవీన్ కుమార్, జే.కృష్ణ, గజివెల్లి రమేష్‌బాబు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో కోలాహలం



ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: నిత్య పూజలు, భక్తుజనులతో ఆదివారం యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో కోలాహలం నెలకొంది. వేకువజామున స్వామి వారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూలు, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, సహస్రనామార్చనలు చేశారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, స్వామి, అమ్మవారి నిత్య కల్యాణ వేడుక ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ముఖ మండపంలో అష్టోత్తర పూజలు, సాయంత్రం ఆలయంలో వెండి జోడు సేవను ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయద్వారబంధనం చేశారు.



ఆలయ మాఢ వీధుల్లో కిక్కిరిసిన భక్తులు

క్లుప్తంగా

ఆవు దూడలను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

త్రిపురారం : ఆవు దూడలను అక్రమంగా తరలిస్తున్న డీసీఎంను త్రిపురారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నరేష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఆవు దూడలతో వస్తున్న డీసీఎంను ఆపి విచారించారు. వాటిని కోదాడ సంతలో కొనుగోలు చేసి తాళ్లతో కట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. డీసీఎంలో వెళ్తున్న కోడెల గోకారి, లద్దగిరి రాములు, గొల్ల మల్లికార్జున్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు

- ఇద్దరికి గాయాలు

బీబీనగర్‌: కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున బీబీనగర్‌ మండలం బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలో జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన చమన్‌సింగ్‌ కారులో మరో ముగ్గురితో కలిసి బ్రాహ్మణపల్లి వైపు వస్తుండగా.. గ్రామంలోని దుర్గమ్మ గుడి సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ పూర్తిగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామ లైన్‌మెన్‌ కందుకూరి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బొలేరో వాహనం ఢీకొని..

మర్రిగూడ: బొలేరో వాహనం ఢీకొని వృద్ధుడు గాయపడ్డాడు. ఈ ఘటన మర్రిగూడ మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలం రాజాపేటతండాకు చెందిన ఐతగోని రామస్వామి ఆదివారం సాయంత్రం మర్రిగూడ మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా మాల్‌ నుంచి అతివేగంగా వస్తున్న బొలేరో వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో రామస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి రామస్వామి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బొలేరో వాహనాన్ని పోలీస్‌ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపారు.

స్వర్ణగిరీశుడికి వైభవంగా నిత్య కల్యాణం


నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి ఆదివారం ఆలయ అర్చకులు నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, మధ్యాహ్నం సుమారు 5వేల భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, కర్పూర మంగళహారతుల సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆటో వచ్చింది.. కాలినడక తప్పింది

- దాత సహకారంతో అల్లీపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు ఆటోను ఏర్పాటు చేసిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు
- చుట్టుపక్కల తండాల నుంచి వచ్చే విద్యార్థులతో పెరిగిన అడ్మిషన్లు


బడిబాట ప్రచారం చేస్తున్న అల్లీపురం జెడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు (ఫైల్‌)

మఠంపల్లి: మఠంపల్లి మండలం అల్లీపురం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో గతంలో చదివిన విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చారు. ఈ పాఠశాలలో అల్లీపురంతో పాటు కాల్వపల్లి తండా, పాతదొనబండ తండా, కొత్తదొనబండ తండా, జామ్లా తండా గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుకునేవారు. కానీ ప్రస్తుతం సరైన రవాణా సౌకర్యం లేక ఆయా తండాల విద్యార్థులు పట్టణాల్లో బడులకు వెళ్తున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా అల్లీపురం జెడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎం మోదుగు శేషిరెడ్డి, ఉపాధ్యాయులు ఎలాగైనా పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పాఠశాల పరిధిలోని ఆయా తండాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి అల్లీపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు తమ పిల్లలను పంపించాలని కోరారు. అయితే అల్లీపురం పాఠశాలకు గతంలో తమ తండాల నుంచి బస్సులు, ఆటోలు నడిచేవని, ప్రస్తుతం బస్సు లేకపోవడంతో 2 నుంచి 4 కిలోమీటర్ల దూరం ఉన్న తండాల నుంచి పిల్లలు పాఠశాలకు చేరుకోవాలంటే కాలినడకన రావాల్సి ఉంటుందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. దీంతో ఎలాగైనా విద్యార్థులకు వాహనం ఏర్పాటు చేస్తామని వారి తల్లిదండ్రులకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కాల్వపల్లితండా మాజీ సర్పంచ్‌ మాలోతు సుజాతాసక్రునాయక్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కలిసి.. పరిస్థితిని వివరించి, ఏడాది కాలానికి పాఠశాల పరిధిలోని తండాలకు చెందిన విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లేలా ఆటో ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాలలో 40మంది వరకు ఉన్న విద్యార్థుల సంఖ్య 60కి పెరిగింది. ఇప్పటికీ నిత్యం అడ్మిషన్లు జరుగుతూనే ఉన్నాయని హెచ్‌ఎం తెలిపారు. ఆటో ఏర్పాటు చేసిన దాతను, హెచ్‌ఎం, ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

రోజూ ఆటోలోనే వచ్చివెళ్తున్నాం



మా తండా నుంచి అల్లీపురం జెడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాలకు సుమారు 3 కిలోమీటర్లు దూరం ఉండటంతో పాఠశాలకు కాలినడకన రాలేక ఇబ్బందులు పడేదాన్ని. ఇప్పుడు ప్రతిరోజు హెచ్‌ఎం సార్‌, టీచర్లు ఏర్పాటు చేయించిన ఆటోలోనే వచ్చివెళ్తున్నాం. ఎంతో ఆనందగా ఉంది. – భూక్యా శరణ్య, 7వ తరగతి, కాల్వపల్లితండా

దాత సహకారం మరువలేనిది



అల్లీపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు విద్యార్థులను చేరవేయడానికి ఆటోను సమకూర్చిన కాల్వపల్లితండా మాజీ సర్పంచ్‌ మాలోతు సుజాతాసక్రునాయక్‌ సహకారం మరువలేనిది. ఆటో ఏర్పాటు చేయడంతో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు ఇంకా అడ్మిషన్లు జరుగుతూనే ఉన్నాయి. – మోదుగు శేషిరెడ్డి, హెచ్‌ఎం

పెండెం జగదీశ్వర్‌ సాహిత్య సేవ చిరస్మరణీయం


పురస్కారం అందుకుంటున్న మంజులూరి కృష్ణకుమారి

రామగిరి(నల్లగొండ): బాల సాహితీరత్న పెండెం జగదీశ్వర్‌ బాల సాహిత్యానికి చేసిన కృషి చిరస్మరణీయమని ప్రముఖ బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్‌ అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎంవీఎన్‌ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పెండెం జగదీశ్వర్‌ స్మారక ఆరో జాతీయ పురస్కార ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పెండెం జగదీశ్వర్‌ సాహిత్యాన్ని ప్రతి పాఠశాలకు చేర్చవలసిన బాధ్యత ప్రభుత్వానికి, సమాజానికి ఉందన్నారు. జగదీశ్వర్‌ స్మారక జాతీయ పురస్కారాన్ని విజయవాడకు చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త మంజులూరి కృష్ణకుమారికి అందజేశారు. ఈ పురస్కారం కింద రూ.5వేల నగదు, ప్రశంసా పత్రంతో ఆమెను ఘనంగా సత్కరించారు. పురస్కార గ్రహీత మంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ.. జగదీశ్వర్‌ పేరిట వారి స్నేహితులు పురస్కారాన్ని ఏర్పాటు చేసి జాతీయస్థాయిలో బాల సాహిత్యంలో విశిష్ట కృషిచేసిన రచయితలకు అందజేస్తుండడం అభినందనీయమన్నారు. ప్రముఖ కథా రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. జగదీశ్వర్‌ మరణం బాల సాహిత్యానికి తీరని లోటని అన్నారు. డాక్టర్‌ తండు కృష్ణకౌండిన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్‌, సృజన సాహితీ అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ల ఆనంద్‌, డాక్టర్‌ సాగర్ల సత్తయ్య, రచయితలు పుప్పాల కృష్ణమూర్తి, డాక్టర్‌ పగడాల నాగేందర్‌, డాక్టర్‌ ఉప్పల పద్మ, పెందోట సోము, దాసోజు శ్రీనివాస్‌, శంకర్‌, బాసరాజు యాదగిరి, బండారు శంకర్‌, శ్రవణ్‌ కుమార్‌, భీమార్జున్‌రెడ్డి, మాదగాని శంకరయ్య, మోతుక్కూరు శ్రీనివాస్‌, వడ్డేపల్లి వెంకటేష్‌, ముక్కామల జానకిరామ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేప్‌ షట్టర్‌లు బిగించేందుకు ఏర్పాట్లు


ఎస్కేప్‌ షట్టర్లకు రంగులు వేస్తున్న దృశ్యం

నడిగూడెం : నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద సాగర్‌ ఎడమ కాల్వకు 132, 133 కిలోమీటర్ల వద్ద గతేడాది రెండు గండ్లు పడ్డాయి. దీంతో వందలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఈ గండ్లు పడడానికి పాలేరు రిజర్వాయర్‌ బ్యాక్‌ వాటర్‌ కాల్వలోకి వెనక్కి రావడం, ఎస్కేప్‌ షట్టర్లు సరిగ్గా లేకపోవడమేనని అధికారులు గుర్తించారు. దీంతో నీటిపారుదల శాఖ ప్రత్యేక నిధులతో 133 కిలోమీటర్‌ వద్ద ఎస్కేప్‌కు పాత షట్టర్లు తొలగించి, కొత్త షట్టర్లు అమర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో అత్యవసర సమయంలో నీటిని విడుదల చేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

వైద్యం వికటించి బాలుడి మృతి

- డాక్టర్‌ నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువుల ఆరోపణ
- ఆస్పత్రి ఎదుట ఆందోళన
- పోలీసులు రావడంతో ఉద్రిక్తత
- బాధితులు రాళ్లు రువ్వడంతో కానిస్టేబుల్‌కు గాయాలు


బాలుడి మృతదేహం



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాలుడి బంధువులు

సూర్యాపేట టౌన్‌: వైద్యం వికటించి మూడు నెలల బాలుడు మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలుడు మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆదివారం ధర్నా చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం గుడితండాకు చెందిన జాటోత్‌ జలంధర్‌, మనీషా దంపతులకు మూడు నెలల క్రితం బాబు జన్మించాడు. నాలుగు రోజుల క్రితం బాలుడికి జ్వరం రావడంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రైమ్‌ చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. మొదటి రెండు రోజులు బాగానే ఉందని చెప్పిన వైద్యుడు.. ఆదివారం బాలుడి ఆరోగ్యం విషమించడంతో ఖమ్మం తీసుకెళ్లాలని చెప్పాడని, ఖమ్మం తీసుకెళ్లాక బాలుడు మృతిచెందాడని అక్కడి వైద్యులు తెలిపాడని బాలుడి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. ప్రైమ్‌ పిల్లల హాస్పిటల్‌ వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలుడు మృతిచెందాడని, తమకు న్యాయం చేయాలని బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆందోళన చేశారు. హాస్పిటల్‌లో సరైన వసతులు లేకుండా వైద్యం నిర్వహిస్తున్నారని, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు హాస్పిటల్‌ను సీజ్‌ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

ఆస్పత్రి ఎదుట ఉద్రిక్త వాతావరణం..

పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని వారిని చెదరకొట్టే క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బాలుడి బంధువులు పలువురు ఆస్పత్రిపై రాళ్లు విసురుతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్‌ తలకు తగిలి గాయమైంది. అదే విధంగా బాలుడి బంధువుల్లో ఓ వ్యక్తి పెట్రోల్‌ బాటిల్‌తో ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్‌, సీఐ రాజశేఖర్‌ ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యుడిని వివరణ కోరగా.. తల్లి బాబుకు పాలు తాగిపిస్తుండగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో ఖమ్మం తీసుకెళ్లాలని సూచించానని తెలిపాడు. తన నిర్లక్ష్యం ఏమీ లేదని ఆయన పేర్కొన్నాడు.

జూదరుల అరెస్ట్‌

చింతపల్లి: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను చింతపల్లి పోలీసులు ఆదివారం అరెస్ట్‌ చేశారు. ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని పోలేపల్లి రాంనగర్‌ గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. మరో ఇద్దరు పరారయ్యారు. వారి నుంచి నాలుగు మోటార్‌ సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.13,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధ మహిళలపై మతిస్థిమితం లేని యువకుడి దాడి


దాడి చేసిన యువకుడిని కట్టేసిన స్థానికులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ కొండకు దిగువన ఉన్న లక్ష్మీ పుష్కరిణి సమీపంలో మతిస్థిమితం లేని యువకుడు ఇద్దరు భిక్షాటన చేసే వృద్ధ మహిళలపై దాడికి పాల్పడిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పట్టణ సీఐ భాస్కర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా లక్ష్మీ పుష్కరిణి చెంత ఇద్దరు వృద్ధ మహిళలు భిక్షాటన చేస్తున్నారు. అక్కడే మతిస్థిమితం లేని యువకుడు కూడా ఉంటున్నాడు. అతడికి చెవులు వినిపించవు. శనివారం ఇద్దరు వృద్ధ మహిళల్లో ఒకరు భిక్షాటన చేసేందుకు వస్తుండగా.. సదరు యువకుడు పరిగెత్తుకుంటూ వచ్చి ఆమె కడుపులో తన్నాడు. వెంటనే ఆమె బీటీ రోడ్డుపై పడటంతో తలకు గాయమైంది. ఆమెకు కాపాడేందుకు వచ్చిన మరో వృద్ధ మహిళను సైతం ఆ యువకుడు కొట్టి గాయపరిచాడు. స్థానిక హోటల్‌ నిర్వాహకులు, దుకాణదారులు, యువకులు ఆ మతిస్థిమితం లేని యువకుడిని తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు. గాయపడిన వృద్ధ మహిళలను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆదివారం సీఐ భాస్కర్‌ను వివరణ కోరగా.. గతేడాది సైతం ఆ యువకుడు పలువురిపై దాడి చేసి గాయపరిచాడని తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదన్నారు. మహిళను కడుపులో తన్నుతూ, దాడి చేసిన వీడియో అక్కడే ఉన్న హోటల్‌ సీసీ కెమెరాలో రికార్డయ్యింది అన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చందంపేట: నేరెడుగొమ్ము మండలం బచ్చాపూర్‌ గ్రామానికి చెందిన కేతావత్‌ లష్కర్‌(34) ఆదివారం తన వ్యవసాయ పొలంలో బోరు మోటారు ఆన్‌ చేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న ప్రముఖులు


యోగితారాణాకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా, ఆమె కుటుంబ సభ్యులు, నేషనల్‌ పోలీస్‌ అకాడమీ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రాధిక వేర్వేరుగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా.. ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ లడ్డూ ప్రసాదం అందజేశారు.

సంస్కృత విద్యా పీఠం సందర్శించిన ఈఓ


సంస్కృత విద్యా పీఠంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్‌

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని బస్టాండ్‌ సమీపంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్కృత విద్యా పీఠాన్ని, వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిల్ప కళాశాలను ఈఓ వెంకట్రావ్‌ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా శిల్ప కళాశాలలోని వసతులు, బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టెంపుల్‌ ఆర్కిటెక్చర్‌ కోర్సు వివరాలను ప్రిన్సిపాల్‌ మోతీలాల్‌ను అడిగి ఈఓ తెలుసుకున్నారు. విద్యార్థులు తాము నేర్చుకున్న టెంపుల్‌ ఆర్కిటెక్చర్‌ డ్రాయింగ్‌, రాతి, సిమెంట్‌తో చేసే విధానాన్ని ఈఓకు వివరించారు. అనంతరం సంస్కృత విద్యా పీఠానికి వెళ్లి విద్యార్థులు, బోధకులతో మాట్లాడారు. ఈ విద్యా పీఠంలో ఎంతో సామాజిక స్పృహతో అన్ని కులాల వారికి సంస్కృత భాషా జ్ఞానం కల్పించి, దినదినాభివృద్ధి చెందుతుందని ఈఓ తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ, సంస్కృత విద్యా పీఠం, శిల్పా కళాశాల బోధకులున్నారు.

స్నేహానికి షష్టిపూర్తి.. మరువలేని అనుభూతి

- మాజీ స్పీకర్‌, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


దేవాలయంలో పూజలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, హైస్కూల్‌ మిత్రులు

నార్కట్‌పల్లి: స్నేహానికి షష్టిపూర్తి.. మరువలేని అనుభూతి అని తెలంగాణ శాసనసభ మాజీ స్పీకర్‌, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో 1965 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నార్కట్‌పల్లి మండలం గోపాలయపల్లి గ్రామ సమీపాన గల శ్రీ వారిజాల వేణు గోపాలస్వామి దేవాలయ చైర్మన్‌, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పెద్దన్న కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి ఆహ్వానం మేరకు తన క్లాస్‌మేట్‌ అయిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో మరికొంతమంది మిత్రులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం పోచారం మాట్లాడుతూ.. పెళ్లికి షష్టిపూర్తి, వయస్సుకి షష్టిపూర్తి ఉంటుంది, కానీ స్నేహానికి షష్టిపూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట మరికొంత మంది మిత్రులు ఉన్నారు.

యాదగిరిగుట్టలో ఆర్టీఏ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం


పాతగుట్టలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వివిధ జిల్లాల ఆర్టీఏ సభ్యులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటిలోని పాతగుట్టలో 33 జిల్లాలకు చెందిన రీజినల్‌ ట్రాన్స్‌పోర్ట్‌ అథారిటీ(నాన్‌ అఫీషియల్‌) సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టీఏ సభ్యుడు ఆకుల నరసింహ మాట్లాడుతూ.. నిత్యం ప్రజలతో మమేకమవుతూ ప్రయాణికులకు ప్రయోజనం కల్పించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా పరమైన సమస్యలు, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి విషయాల్లో రవాణా శాఖ అధికారులతో కలిసి పనిచేస్తూ రాష్ట్ర రవాణా శాఖ గౌరవాన్ని పెంచేలా తమవంతు కృషి చేసేందుకు ప్రతిఒక్కరు ప్రయత్నించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ జిల్లా సభ్యులు పడాల రాహుల్‌, జాఫర్‌, వెంకన్న, కృష్ణ, అభిగౌడ్‌, భూపాల్‌రెడ్డి, మురళీ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని..

- డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు


భువనగిరిటౌన్‌: భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో వార్డు ఆఫీసర్‌ పేరు చెప్పి ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని రూ.20వేలు వసూలు చేసిన అందె నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు యాదాద్రి జిల్లా కలెక్టర్‌ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇప్పిస్తామని లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లయితే క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్‌ స్పష్టం చేశారు. లబ్ధిదారులు దళారుల మాట నమ్మొద్దని, ఎవరైనా ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

సూర్యాపేటటౌన్‌: ప్రైవేట్‌ ఫైనాన్స్‌ కంపెనీల్లో లోన్లు తీసుకుని చెల్లించలేక మనస్తాపానికి గురైన వ్యక్తి సైనేడ్‌ అన్నంలో కలుపుకుని తిని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సైనిక్‌పురి కాలనీకి చెందిన తావిటి మధుసూధనచారి(47) వృత్తి రీత్యా కంసాలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు పలు ప్రైవేట్‌ ఫైనాన్స్‌ కంపెనీల్లో లోన్లు తీసుకున్నాడు. ఆ లోన్లు చెల్లించడం లేదని ఆయా ఫైనాన్స్‌ కంపెనీల ప్రతినిధులు రోజూ ఇంటి వద్దకు, షాపు వద్దకు వస్తుండటంతో మనస్తాపం చెంది శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బంగారం మెరవడం కోసం ఉపయోగించే సైనేడ్‌ను అన్నంలో కలుపుకుని తిన్నాడు. మధుసూధనచారి భార్య పూర్ణిమ ఇంటికి వచ్చి చూసేసరికి అతడు బెడ్‌పై అపస్మారక స్థితిలో పడి ఉండటంతో వెంటనే ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ పోలీసులు తెలిపారు.

యాదగిరిగుట్ట సర్కిళ్లలో దేవతామూర్తుల విగ్రహాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట దిగువన రింగ్‌ రోడ్డు సర్కిల్స్‌కు ఇటీవల వివిధ దేవతామూర్తుల పేర్లను నామకరణం చేశారు. ఈ నేపథ్యంలో పాతగుట్ట చౌరస్తా, వైకుంఠద్వారం, ప్రెసిడెన్షియల్‌ సూట్‌, మూడవ ఘాట్‌ రోడ్డు, మల్లాపురానికి వెళ్లే దారుల్లోని సర్కిల్స్‌లో ఆయా దేవతామూర్తుల విగ్రహాలను పెట్టినట్లుగా ఉన్న ఫొటోలను కొంతమంది సోషల్‌ మీడియాలో షేర్‌ చేయడంతో వైరల్‌గా మారాయి. ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొడకండ్ల మాధవాచార్యులు రూపకల్పన చేసినట్లు పొందుపరిచారు.


యాదగిరిగుట్ట ఆలయ ప్రధాన రహదారిలో రామానుజ స్వామి విగ్రహం నమూనా


హనుమాన్‌ సర్కిల్‌ వద్ద హనుమంతుడి విగ్రహం నమూనా


గరుత్మంతుడి విగ్రహం


ప్రెసిడెంట్‌ సూట్‌ సర్కిల్‌లో యాదరుషి విగ్రహం


ప్రహ్లాదుడి విగ్రహం నమూనా